సాక్షి

మహబూబ్‌నగర్

ఆదివారం, 24, ఆగస్టు, 2025



'కురుమూర్తి' జన సంద్రం

శ్రావణమాసం చివరి శనివారం, అమావాస్య సందర్భంగా కురుమూర్తిస్వామి ఆలయానికి భక్తులు భారీగా పోటెత్తారు.

-8లో ▸



జూరాలకు తగ్గని వరద

జూరాల జలాశయానికి రోజురోజుకు వరద ఉధృతి పెరుగుతోంది. శనివారం 4.08 లక్షల క్యూసెక్కులుగా ఉంది.

-8లో ▸

గరిష్టం/కనిష్టం

33.5 /21.1

వాతావరణం

ఆకాశం ఉదయం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత జల్లులు పడే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

ఎర్ర సూరీడుకి జోహార్లు

- స్వగ్రామం కంచుపాడులో సురవరం సుధాకర్‌రెడ్డికి ఘనంగా నివాళి
- నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్న గ్రామస్తులు



సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళులు అర్పిస్తున్న కొండ్రావుపల్లె గ్రామస్తులు

అలంపూర్/ఉండవెల్లి: సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి (83) మృతితో ఆయన స్వగ్రామం జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం కంచుపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు ఆయన జ్ఞాపకాలను నెమరు వేసుకొని బాధాతప్త హృదయాలతో కన్నీటి పర్యంతమై శ్రద్ధాంజలి ఘటించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం తుది శ్వాస విడిచారు. మారుముల గ్రామం నుంచి జాతీయ నేతగా ఎదిగిన ఆయన ప్రస్థానం గురించి చర్చించారు. పేద, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు.

సొంతూరిపై మమకారం..

జాతీయ రాజకీయాలను శాసించిన సురవరానికి సొంతూరిపై మమకారం ఎక్కువ. సీపీఐ అగ్రనేతగా ఉన్న సమయంలోనూ తరుచూ వచ్చి వెళ్లేవారు. తండ్రి సురవరం వెంకట్రామిరెడ్డి పేరు మీద విజ్ఞాన కేంద్రం నెలకొల్పి యువతులు, మహిళలకు కుట్టు శిక్షణ, యువకులకు కంప్యూటర్ శిక్షణ ఇప్పించారు. అలాగే ఏటా సంక్రాంతికి ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించి యువతను ప్రోత్సహించారు. కరోనా సమయంలో ఐసోలేషన్ కిట్స్, నిత్యావసర సరుకులు అందించి ఆసరాగా నిలిచారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు అందించారు. సీపీఐ మహాసభలు, యువజన ఉత్సవాలు సురవరం విజ్ఞాన కేంద్రంలోనే నిర్వహించి సొంతూరిపై అభిమానాన్ని చాటుకున్నారు. క్రీడాకారులకు క్రీడాసామగ్రిని పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణపై గ్రామీణులకు అవగాహన కల్పిస్తూనే సొంత ఇంటి ఆవరణలో రకరకాల మొక్కలు పెంచి ఆదర్శంగా నిలిచారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ట్యాంకును నిర్మించారు. ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులను ప్రోత్సహించి విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య అభ్యసించే అవకాశాలు కల్పించారు.



కంచుపాడులో చివరిసారిగా జరిగిన పార్టీ మహాసభలో సురవరం (ఫైల్)

నిరాడంబర జీవనం ఆయన ప్రత్యేకత..

సురవరం జీవనం నిరాడంబరంగా సాగింది. పార్టీలో జాతీయస్థాయి పదవితో పాటు ఎంపీగా రెండు పర్యాయలు సేవలందించారు. కానీ సొంతూరికి వచ్చిన సమయాల్లో ఆయన చాలా నిరాడంబరంగా ఉండేవారు. ఇంటి వద్ద బయట కూర్చొని వచ్చిపోయే వారితో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకునేవారు. గ్రామ వీధుల్లో సైతం సాదాసీదాగా తిరుగుతూ అందరిని పలుకరించేవారు.

సాగులో మెళకువలు చెప్పేవారు..



సురవరం పొలాలను మేమే సాగు చేస్తాం. గ్రామానికి వచ్చినప్పుడు పంటలను తప్పక పరిశీలించేవారు. దిగుబడి, చీడపీడల గురించి అడిగి తెలుసుకొని కొత్త పంటల గురించి వివరించేవారు. అందరికి సహకరిస్తూ సాయంగా ఉండేవారు.

– చిన్న కర్రెన్న, కంచుపాడు

అన్యోన్యంగా ఉండేవారు..



సురవరం సుధాకర్‌రెడ్డి గ్రామానికి వచ్చిన సమయాల్లో రాజకీయాల గురించి అడిగి తెలుసుకునే అలవాటు. అలాగే ప్రతి సంక్రాంతికి యువతను ప్రోత్సహించడానికి క్రీడా పోటీలు నిర్వహించేవారు. తనతోపాటు కూర్చున్న యువకులకు క్రీడలు, జీవితంలో రాణించడం తదితర అనేక అంశాలపై అవగాహన కల్పించేవారు. అందరితో ఎంతో అనోన్యంగా ఉండేవారు.

– వీరేష్, మండల అధ్యక్షుడు, ఏఐవైఎఫ్

కొండ్రావుపల్లెతో ప్రత్యేక అనుబంధం

సాక్షి, నాగర్‌కర్నూల్: సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి మరణంతో నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం కొండ్రావుపల్లెలో విషాదం నెలకొంది. సురవరం సుధాకర్‌రెడ్డి అమ్మమ్మ ఊరు అయిన కొండ్రావుపల్లెలోనే 1942 మార్చి 25న జన్మించారు. గ్రామంలోని వద్ది రాంరెడ్డి మనవడిగా సుధాకర్‌రెడ్డి గ్రామస్తులకు సుపరిచితుడు. బాల్యంలో ఎక్కువ సమయం పాటు కొండ్రావుపల్లెలోనే గడిపేవాడు. ఎంపీగా, జాతీయ స్థాయి కమ్యూనిస్టు అగ్రనేతగా ఎదిగినా తనకు సమయం కుదిరినప్పుడల్లా కొండ్రావుపల్లెకు వచ్చి బంధువులతో ఆత్మీయంగా గడిపేవాడని గ్రామస్తులు గుర్తుచేసుకుంటున్నారు.



ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన లాంచీ

ద్వీపానికి సొబగులు

- అమరగిరి ద్వీపంలో పర్యాటకులకు సకల వసతులు
- వెల్‌నెస్, స్పిరిచువల్ రిట్రీట్ ప్రాజెక్ట్‌తో పర్యాటకుల ఆకర్షణ
- రూ.68.10 కోట్ల వ్యయ అంచనాతో నిర్మాణ పనులు
- నల్లమల అడవి, కృష్ణానది అందాలను ఆస్వాదించేలా రూపకల్పన

సండే స్పెషల్

సాక్షి, నాగర్‌కర్నూల్: చుట్టూ పచ్చగా కళకళలాడుతున్న నల్లమల కొండలు, మధ్యలో నుంచి నీలిరంగు పులుముకొని పరవళ్లు తొక్కుతూ సాగిపోయే కృష్ణమ్మ.. ఆ నది మధ్యలో ప్రకృతి ప్రేమికులు సేద దీరేందుకే ఆశ్రయం ఇచ్చిందా అన్నట్టుగా ఉన్న దీవి. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని కృష్ణానది తీరంలోని అమరగిరి ద్వీపంలో పర్యాటకుల కోసం సకల వసతులు ఏర్పాటు చేయనున్నారు. రూ.68.10 కోట్ల వ్యయ అంచనాతో ప్రభుత్వం వెల్‌నెస్, స్పిరిచువల్ రిట్రీట్ ప్రాజెక్ట్ చేపడుతోంది. ఇందుకు సంబంధించిన పనులకు శుక్రవారం మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు. ఒకేచోట పర్యావరణం, అడవులు, ఆధ్యాత్మికత, రీక్రియేషన్, వెల్‌నెస్, వాటర్ స్పోర్ట్స్ అందుబాటులో ఉండేలా ఈ ప్రాజెక్టును రూపకల్పన చేశారు.

పర్యాటకం, ఆధ్యాత్మికం ఒకేచోట..

పర్యాటకంగా విస్తృత అవకాశాలు ఉన్న కృష్ణాతీరంలోని అమరగిరి ద్వీపంలో సమీపంలో పురాతన ఆలయాలను అనుసంధానిస్తూ టెంపుల్ టూరిజంగా తీర్చిదిద్దడంతో పాటు పర్యాటకులకు ఆరోగ్యం, ఆహ్లాదాన్ని పంచేందుకు వీలుగా టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం 'స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్(సాస్కి) స్కీమ్ కింద నిధులను వినియోగించనున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా అమరగిరి సమీపంలో కృష్ణానదిలో ఉన్న సుమారు 8 ఎకరాల ద్వీపంలో వెల్‌నెస్, స్పిరిచువల్ రిట్రీట్ ప్రాజెక్ట్ పనులను ప్రభుత్వం చేపట్టింది. ఈ ద్వీపంలో పర్యాటకుల వసతి కోసం రూ.45.84 కోట్ల వ్యయంతో 30 వరకు కాటేజీల నిర్మాణం, కెఫెటేరియా, యోగా డెస్క్, స్పా సెంటర్, ఇన్‌డోర్ గేమ్స్, స్విమ్మింగ్‌పూల్, ల్యాండ్‌స్కేప్ గార్డెన్, వాచ్‌టవర్, వ్యూ పాయింట్, జెట్టీబోట్స్, ధ్యాన మందిరం సౌకర్యాలను కల్పించనున్నారు. పర్యాటకులు ఒకసారి ద్వీపంలో ప్రవేశించాక అధ్యాత్మిక, పర్యాటక అనుభూతులను ఒకేచోట ఆస్వాదించేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. కృష్ణాతీరంలోని సోమశిలలో వీఐపీ ఘాట్ వద్ద బోటింగ్ పాయింట్ ఏర్పాటు చేయనున్నారు. కొల్లాపూర్ మండలంలోని లలితా సోమేశ్వర ఆలయం, జటప్రోలులోని పురాతన మదనగోపాలస్వామి ఆలయాలకు అనుసంధానిస్తూ టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేయనున్నారు.

ఈగలపెంటలో రివర్ క్రూయిజ్

అమ్రాబాద్ మండలం ఈగలపెంట వద్ద శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్‌వాటర్‌లో ఈగలపెంట రివర్ క్రూయిజ్ నోడ్ కింద పనులు చేపట్టనున్నారు. చుట్టూ ఉన్న ప్రకృతి అందాలను వీక్షించేలా రూఫ్ టాప్ కేఫ్ నిర్మాణం, వ్యూయింగ్ డెక్, ల్యాండ్‌స్కేపింగ్ గార్డెన్, గోల్ఫ్ కార్ట్, లైటింగ్, ఎలక్ట్రికల్ పనులు చేపట్టనున్నారు. ఈగలపెంటలోనే చెంచు మ్యూజియం నిర్మాణం ద్వారా స్థానిక చెంచుల జీవన స్థితిగతులపై పర్యాటకులకు అవగాహన కల్పిస్తారు. ఈ సర్క్యూట్ పరిధిలో పర్యాటకుల కోసం వసతులు, పార్కింగ్, రోడ్డు సౌకర్యాలను విస్తృతం చేయనున్నారు.

ఏడాదిలోనే పనులు పూర్తి..



అమరగిరి ఐలాండ్‌లో టూరిజం వెల్‌నెస్, స్పిరిచువల్ రిట్రీట్ ప్రాజెక్ట్ ద్వారా పర్యాటకులకు అధునాతన వసతులను కల్పించనున్నాం. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో సందర్శకులకు ఈ ప్రాంతం మంచి డెస్టినేషన్ అవుతుంది. టూరిజం అభివృద్ధి ద్వారా కొల్లాపూర్ ప్రాంత రూపురేఖలు మారుతాయి. కేవలం ఏడాది కాలంలోనే పనులను పూర్తి చేస్తాం.

– జూపల్లి కృష్ణారావు, మంత్రి

సోమశిల వెల్‌నెస్, స్పిరిచువల్ రిట్రీట్ ప్రాజెక్ట్ మొత్తం వ్యయం	అమరగిరి ఐలాండ్ వెల్‌నెస్ రిట్రీట్ ప్రాజెక్ట్ వ్యయం	సోమశిల వీఐపీ ఘాట్
రూ.68.10 కోట్లు	రూ.45.84 కోట్లు	రూ.1.60 కోట్లు
ఈగలపెంట అరైవల్ జోన్, ప్రోమోనోడ్	ఈగలపెంట రివర్ క్రూయిజ్ నోడ్	ఈగలపెంట చెంచు మ్యూజియం
రూ.8.36 కోట్లు	రూ.7.69 కోట్లు	రూ.3.60 కోట్లు



న్యూస్‌రీల్

సైబర్ నేరాలను కట్టడి చేయాలి: ఎస్పీ

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో సైబర్ నేరాల కట్టడిలో సైబర్ వారియర్స్ విధులు కీలకమని, సోషల్ మీడియాలో అనుమానాస్పద కంటెంట్‌లపై నిఘా ఉంచాలని ఎస్పీ డి.జానకి అన్నారు. సైబర్ వారియర్స్‌కు శనివారం ఎస్పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డిజిటల్ ఫోరెన్సిక్, సైబర్ ఇంటలిజెన్స్ సేకరణ వంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు చాలా వేగంగా పెరుగుతున్నాయని, ప్రజలకు ఈ నేరాలపైఅవగాహన కలిగించడం చాలా అవసరమన్నారు. అనంతరం ఉత్తమ పనితీరు కబనర్చిన సైబర్ వారియర్స్‌కు ఎస్పీ రివార్డులు అందజేశారు. డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి సైబర్‌క్రైం ఎస్ఐ శ్రావణ్ పాల్గొన్నారు.

పరేడ్‌కు ఎంపికలు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో ఎన్ఎస్ఎస్ సెల్ విద్యార్థులకు గణతంత్ర వేడుకలకు సంబంధించి ప్రీ ఆర్డీ సెలక్షన్స్‌ను అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంపికలను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని, పరేడ్‌కు ఎంపికైన విద్యార్థులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని, రాష్ట్రపతి లాంటి వ్యక్తులను కలిసేందుకు అవకాశం ఉందన్నారు. రీజినల్ కోఆర్డినేటర్ సైదా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ, ఈశ్వర్‌కుమార్, రవికుమార్, జ్ఞానేశ్వర్, శివకుమార్‌సింగ్, గాలెన్న, పీడీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్ష గాంధీ విగ్రహాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: అక్టోబర్ 2న లక్ష గాంధీ విగ్రహాలను ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను డీఈఓ ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. ప్రతి పాఠశాల, కళాశాలలో జాతిపిత జయంతి సందర్భంగా చిన్నచిన్న విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు గాంధీ ప్రతిష్టాన్ గ్లోబల్ సంస్థ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు

- గణేష్ నిమజ్జనం, మిలాద్-ఉన్-నబీ ప్రశాంతంగా జరుపుకోవాలి
- నిర్వాహకులు, ప్రజలు పూర్తిగా సహకరించాలి
- శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్ విజయేందిర
- మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి: ఎస్పీ జానకి



శాంతి కమిటీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయేందిర, ఎస్పీ జానకి, ఇతర అధికారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): శాంతియుత, ప్రశాంత వాతావరణంలో వినాయక నవరాత్రులు, నిమజ్జనం, మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా జరుపుకోవాలని కలెక్టర్ విజయేందిర సూచించారు. ఉత్సవాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తిస్థాయి సహాయసహకారాలు అందిస్తామని, రోడ్ల మరమ్మతులు ,శోభాయాత్ర నిర్వహించే వంటి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 27న వినాయక చవితి, సెప్టెంబర్ 5న నిమజ్జనం, వచ్చే నెల 5 లేదా 6వ తేదీల్లో నిర్వహించే మిలాద్-ఉన్-నబీ వేడుకలకు భద్రతాపరమైన చర్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేడుకల నిర్వహణ సజావుగా జరిగేలా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఆర్డీఓ, డీఎస్పీలతో కూడిన అధికారుల కమిటీ పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. నిమజ్జనం చేసే ప్రాంతాల వద్ద రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు విధులు నిర్వహించి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పంచాయతీలు, నిమజ్జన ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆర్-బీ అధికారులు క్రేన్ ఏర్పాటు చేయాలని, మండపాల నిర్వాహకులు మండపాల వద్ద తడి, పొడి చెత్త సేకరణకు డస్ట్‌బిన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రథమ చికిత్స, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జనానికి విగ్రహాల తరలింపు కోసం వాహనాలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌పోర్ట్ అధికారిని ఆదేశించారు. మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల వద్ద మత్స్యశాఖ గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

■ ఎస్పీ జానకి మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు పోలీస్ పోర్టల్ https:policeportal.tspolice.gov.in/indes.htm సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. పోలీస్‌శాఖ తరపున తగిన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండపాల వద్ద నిర్వాహకులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున మండపాల ఏర్పాటులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంటపాల వివరాలను ట్రాన్స్‌కో అధికారులకు తెలియజేసి, ఆ శాఖ సిబ్బంది ద్వారానే విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయించుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం, ప్రజలకు అసౌకర్యం కలగకుండా వినాయక మంటపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. డీజే సౌండ్లను వినియోగించవద్దని సూచించారు. మండపాల వద్ద భక్తి పాటలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా నిర్వాహకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి మట్టి విగ్రహాల వాడకంపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఏనుగు నరసింహారెడ్డి, ఏఎస్పీ రత్నం, డీపీఓ పార్థసారథి, ఆర్డీఓ నవీన్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శంకరాచారి, వీహెచ్‌పీ అధ్యక్షుడు యాదిరెడ్డి, ఎంఐఎం అధ్యక్షులు హాదీ, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వచ్చే నెల 13న జాతీయ లోక్ అదాలత్

- జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి



మాట్లాడుతున్న న్యాయమూర్తి బి.పాపిరెడ్డి

పాలమూరు: సెప్టెంబర్ 13న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో భారీస్థాయిలో కేసులు రాజీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు కక్షిదారులకు నోటీసులు అందజేయాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి వెల్లడించారు. జిల్లా కోర్టులోని న్యాయమూర్తి చాంబర్‌లో శనివారం అన్ని రకాల కోర్టుల న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు, ఏపీపీఓలు, ఇన్సూరెన్స్ ప్యానల్ న్యాయవాదులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, డ్రంక్అండ్‌డ్రైవ్, ఈపెట్టీ, ఎంవీఓపీ మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు అధికంగా రాజీ అయ్యే విధంగా దృష్టి పెట్టాలన్నారు. ఆయా స్టేషన్ పరిధిలో ఉన్న కక్షిదారులకు నోటీసులు అందజేసి లోక్ అదాలత్‌కు తప్పక హాజరయ్యే విధంగా కృషి చేయాలన్నారు. బీమా కంపెనీల నిర్వాహకులు, బ్యాంకు అధికారులు సైతం దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు గుర్తించి సదరు కక్షిదారులు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు శారదాదేవి, ఇందిర, అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం, సీఐలు, ఇన్సూరెన్స్ కంపెనీల సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాకు వచ్చిన యూరియాను అవసరం ఉన్న రైతులకే పంపిణీ చేయాలని, వ్యవసాయ అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ విజయేందిర ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో వీసీ నిర్వహించారు. జిల్లాకు వచ్చిన యూరియాను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ప్రైవేట్ డీలర్లకు కేటాయిస్తామని, సక్రమంగా పంపిణీ జరిగేలా రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో చూసుకోవాలన్నారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారు పై ఉందని తెలిపారు. ఉన్న యూరియా నిల్వలను నిజాయితీగా అవసరమున్న రైతులకే పంపిణీ చేయాలని ఆదేశించారు. పెద్ద రైతులు అనవసరంగా యూరియాను నిల్వ ఉంచుకోవద్దని, ప్రతి రైతుకు 2 బస్తాలు యూరియా సరఫరా చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు వచ్చిన స్టాక్‌ను పీఏసీఎస్‌లకు కేటాయిస్తామన్నారు. యూరియా సక్రమ సరఫరాలో భాగంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, యూరియా ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే జిల్లావ్యాప్తంగా ఎరువుల గోదాములను తనిఖీ చేయాలని ఆదేశించారు. రైతులకు నానో యూరియా ప్రయోజనాలు, వినియోగంపై వ్యవసాయ అధికారులు అవగాహన కలిగించాలని సూచించారు. అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, నరసింహారెడ్డి, వ్యవసాయాధికారి వెంకటేష్, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోసం ఉద్యమం ఉధృతం



కలెక్టరేట్ ఎదుట జీఓ 28 ప్రతులను దహనం చేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానం రద్దు కోసం ఉద్యమం ఉధృతం చేస్తామని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ రాజీవ్‌రెడ్డి అన్నారు. జీఓ 28కి వ్యతిరేకంగా సీపీఎస్ ఉద్యోగులు బ్లాక్ డే నిర్వహించారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, నీటి పారుదల కార్యాలయాల్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జీఓ 28 ప్రతులను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసే వరకు ఉద్యోగ సంఘాల జేఏసీ, టీఎన్‌జీఓ సీపీఎస్ ఉద్యోగులకు అండగా ఉంటుందన్నారు. సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్ మాట్లాడుతూ జీఓ 28కి వ్యతిరేకంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు పెద్ద ఎత్తున బ్లాక్‌డే దినంగా పాటించి నిరసన కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన కొత్తలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేసే అవకాశం ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం జీఓ 28ని తెచ్చిందని ఆరోపించారు. సీపీఎస్‌తో ఉద్యోగులకు ఎలాంటి భద్రతలేదన్నారు. పెన్షన్ అనేది ప్రతి ఒక్క ఉద్యోగి హక్కు అని అలాంటి హక్కును ఉద్యోగికి లేకపోవడం దుర్మార్గమన్నారు. కొత్త పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేదాక పోరాటం చేస్తామన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ విజయేందిరకు అందజేశారు. కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ వెంకటేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, నాయకులు మల్లేష్, ఇనాయత్, కృష్ణారెడ్డి, రామానాయుడు, వెంకటేశ్, బాల్‌రాజు, లక్ష్మయ్య, విజయ్, భాస్కర్, శ్రీనివాస్ రావు, కుర్మయ్య శాంసన్, ప్రియాంక, నీలిమ, ఖరేషీ, అశోక్, సయ్యద్, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.



యూరియా పంపిణీలో విఫలం

- రైతులను చులకనగా మాట్లాడడం సరికాదు
- యూరియా పంపిణీ కేంద్రాలను పరిశీలించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- వివరాలు 9లో...

ఉత్సాహంగా ఈశా గ్రామోత్సవం



వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శనివారం 17వ ఈశా గ్రామోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. పాలమూరులో మూడోసారి గ్రామోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈశా ఫౌండేషన్ నిర్వహించిన జిల్లాస్థాయి పురుషుల వాలీబాల్ పోటీల్లో 22 జట్లు పాల్గొన్నాయి. పోటీల ప్రారంభోత్సవంలో జిల్లా అటవీశాఖ అధికారి సత్యనారాయణ, జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి చెన్న వీరయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

■ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తుండడం సంతోషంగా ఉందని జిల్లా యువజన క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. క్రీడలతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఇలాంటి క్రీడాపోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని ప్రతిభచాటి జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతినిధులు మాట్లాడుతూ 2004లో సద్గురు ప్రారంభించిన ఈశా గ్రామోత్సవం గ్రామీణ భారతదేశ స్ఫూర్తిని పునరుజ్జీవింప చేయడానికి ఉద్దేశించినదని అన్నారు. క్లస్టర్ (జిల్లాస్థాయి), డివిజనల్ (రాష్ట్రస్థాయి), ఫైనల్ (దక్షిణభారత దేశ రాష్ట్రాల పోటీ) మూడు దశల్లో మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు. ప్రతిస్థాయిలో మొదటి నాలుగు స్థాయిల్లో నిలిచిన జట్లకు మెరిట్ సర్టిఫికెట్, నగదు బహుమతి అందిస్తామని తెలిపారు. పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన నుపుర కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ బృందం చేసిన నృత్య ప్రదర్శన అలరించింది.

క్లుప్తంగా

కర్ణాటకకు తరలుతున్న ఎరువుల పట్టివేత



గట్టు: మండల పరిధిలోని బల్గెర చెక్‌పోస్టు వద్ద అక్రమంగా కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్న ఎరువులను శనివారం మార్కెట్ కమిటీ అధికారులు తనిఖీ చేసి పట్టుకున్నారు. కర్ణాటక రైతులు మల్దకల్ మండలంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో 27 యూరియా, 49 కాంపెక్స్ ఎరువుల బస్తాలు కొనుగోలు చేసి వాహనంలో తరలిస్తుండగా పట్టుకుని వ్యవసాయ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి రశీదులను పరిశీలించి తరలింపునకు ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో పోలీసులకు అప్పగించారు.

పిచ్చి కుక్క దాడిలో పలువురికి గాయాలు

తిమ్మాజిపేట: మండలంలోని పోతిరెడ్డిపల్లిలో శనివారం పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలయ్యాయని గ్రామస్తులు తెలిపారు. వ్యవసాయ పొలం నుంచి ఇంటికి వస్తున్న పుట్టగళ్ల హన్మంతుపై దాడి చేసి ముఖంపై కరిచింది. అనంతరం ఆంజనేయ ఆలయ సమీపంలో గొర్రెల దొడ్డి వద్ద ఆరుబయట ఉన్న బాలయ్య, ఆయన మనుమరాలిపై దాడి చేయగా.. వారు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే చికిత్స నిమిత్తం తిమ్మాజిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాత్రి పొద్దుపోయే వరకు కుక్క ఆచూకీ దొరకలేదని, ఇంకా ఎంతమందిని కరుస్తుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. తాడూరు మండలం చర్లతిర్మలాపూర్‌కు చెందిన మణెమ్మ (31) భర్త మృతి చెందడంతో పుర పరిధిలోని ఉయ్యాలవాడలో తండ్రి వద్ద ఉండి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. చాలారోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండేది. వైద్యం చేయించుకున్నా నయం కాకపోవడంతో మనస్థాపానికి గురై ఈ నెల 17న ఇంట్లో పురుగుమందు తాగింది. గుర్తించిన స్థానికులు ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం అటు నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందింది. తండ్రి బుచ్చన్న ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

వ్యక్తి బలవన్మరణం



బాలరాజు (ఫైల్)

కోడేరు: పురుగుమందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగదీశ్వర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఆది బాలరాజు (40) శుక్రవారం పురుగుమందు తాగాడు. అటుగా వెళ్తున్న వారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. భార్య మధులత గతంలోనే మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

చోరీ నిందితుడి అరెస్టు

అచ్చంపేట రూరల్: ఇళ్లలో చోరీకి పాల్పడుతున్న నిందితుడిని అచ్చంపేట పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని రోజుల కిందట పట్టణంలో పట్టపగలే ఇళ్లలో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తి దొంగతనానికి పాల్పడి బంగారు, వెండి, నగదును ఎత్తుకెళ్లాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా కల్యాణదుర్గం గ్రామానికి చెందిన గంగాధర్ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి బంగారు, వెండి, నగదును స్వాధీనం చేసుకున్నారు. శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమతి.. అవిఘ్నమస్తు



- వినాయక మండపాలకు ఆన్‌లైన్ తప్పనిసరి
- వివరాల నమోదుకు పోలీస్‌శాఖ ప్రత్యేక పోర్టల్
- నిర్వాహకుడి సమాచారం, మండపం వివరాలు నమోదు
- అన్నిశాఖల అధికారుల సమన్వయానికి దోహదం
- నాలుగు రోజుల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



కల్వకుర్తి టౌన్: పూజల్లో మొదటి పూజలందుకునే వినాయకుడి నవ రాత్రి ఉత్సవాలు మరో నాలుగు రోజుల్లో ప్రారంభంకానున్నాయి. కాలనీవారంతా ఒక దగ్గరకు చేరి, కోలాటాలు, బతుకమ్మలు, నృత్యాలు, చిన్నారుల కేరింతలు ఇలా పలు రకాల కార్యక్రమాలతో నవరాత్రులను జరుపుకొనేందుకు చిన్న, పెద్ద తేడా లేకుండా సిద్ధమవుతున్నారు. నవరాత్రుల్లో ఎలాంటి ఘటనలు జరగకుండా, ఇబ్బందులు కలిగించేవి ఉంటే వెంటనే పరిష్కారం చేయడానికి పోలీస్‌శాఖ ప్రత్యేక నజర్ పెట్టింది. దీనికి పోలీస్‌శాఖ ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను తయారు చేసింది. వినాయక మండపాలను ఆన్‌లైన్ నమోదు చేయడంతో నవరాత్రుల ప్రారంభోత్సవం నుంచి శోభాయాత్ర, నిమజ్జనం వరకు తదితర అంశాలను చాలా సులువుగా చేపట్టవచ్చని పోలీస్‌శాఖ భావిస్తోంది. ఇలా పోలీస్‌శాఖ అనుమతులే కాకుండా విద్యుత్, అగ్నిమాపక శాఖల నుంచి పొందిన అనుమతుల వివరాలను పోర్టల్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. ఇప్పటికే పోలీస్‌శాఖ వారు ఆన్‌లైన్ విధానంపై పలుమార్లు నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్నారు.



పోలీస్‌శాఖ వారు రూపొందించిన వినాయకుని ఆన్‌లైన్ పేజీ

నమోదు చేసుకోవడం సులభం

- తెలంగాణ పోలీస్‌శాఖ రూపొందించిన httpr://poiceporta.trpoice.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వగానే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ కనిపిస్తుంది. అందులో మండపం ఏర్పాటు చేసే నిర్వాహకుడి పేరు, పూర్తి వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రాంతం, అది ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందనే వివరాలను మొదటి కాలంలో నమోదు చేయాల్సి ఉంటుంది.
- రెండో కాలమ్‌లో వినాయక మండపం వద్ద ఉండే ఐదుగురు సభ్యుల వివరాలు, వినాయక నిమజ్జనం తేదీ, వాటి వివరాలు, రూట్ మ్యాప్ తదితర అంశాలను పొందుపర్చాలి.
- మూడో కాలమ్‌లో వినాయక మండపం ఏర్పాటుకు స్థానికుల అనుమతి, విద్యుత్ శాఖ అధికారి, సౌండ్ సిస్టం అనుమతులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తే వాటికి సంబంధించిన వివరాలను పొందుపర్చాలి.
- ఆన్‌లైన్‌లో అన్ని వివరాలను నమోదు చేశాక, సబ్మిట్ చేస్తే అప్లికేషన్ పూర్తవుతుంది. పూర్తి చేసిన అప్లికేషన్‌తోపాటు, విద్యుత్, మున్సిపాలిటీ, ఇతర కార్యక్రమ వివరాలను సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వాలి. అన్ని వివరాలను పరిశీలించాక పోలీసులు అనుమతులను జారీ చేస్తారు.

పోర్టల్ ముఖ్య ఉద్దేశం

పోలీస్‌శాఖ ద్వారా చేపట్టిన ఆన్‌లైన్ విధానంతో అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే ఘటనాస్థలానికి చేరుకొనే అవకాశం ఉంటుంది. దీంతో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేందుకు దోహదపడుతుంది. మండపాల వద్ద మైకులను వాడే పద్ధతిని కూడా కంట్రోల్ చేసేందుకు సులువవుతుంది.

మట్టి గణపతులను పూజించాలి

ప్రతి ఏటా రసాయనాలతో కూడిన వినాయకులను ఏర్పాటు చేయడంతో పర్యావరణ కాలుష్యం పెరిగిపోతుంది. పర్యావరణం, కాలుష్యం పెరగకుండా ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని పర్యావరణ వేత్తలతోపాటు, పోలీస్, మున్సిపల్ శాఖల అధికారులు కోరుతున్నారు. మట్టి వినాయకులను పూజించడం ద్వారా అవి వెంటనే నీటిలో కరిగిపోయి పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించవని అధికారులు నిర్వాహకులను సూచిస్తున్నారు. మట్టి గణపతి–మహా గణపతి పేరుతో నిర్వాహకులు, ఇతర శాఖల అధికారులు విస్తృత ప్రచారం చేయాల్సిన బాధ్యత ఉందని పలువురు కోరుతున్నారు.

అనుమతులు తీసుకోవాల్సిందే..



వినాయకుడి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్‌శాఖ రూపొందించిన పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. అనుమతులు లేకుండా వినాయక మండపాలను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటాం. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, ప్రశాంతంగా నవరాత్రులను జరుపుకొనేందుకు వీలుంటుంది.
– వెంకట్‌రెడ్డి, డీఎస్పీ, కల్వకుర్తి

కురుమూర్తి క్షేత్రం.. భక్తజన సంద్రం



రాజగోపురం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



జాతర మైదానంలో భక్తుల జాగరణ

- అమావాస్య సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తులు
- స్వామివారికి ప్రత్యేక పూజలు
- మార్మోగిన గోవింద నామస్మరణ

చిన్నచింతకుంట: శ్రావణమాసం చివరి శనివారం, అమావాస్య సందర్భంగా అమ్మాపూర్ కురుమూర్తి స్వామి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చి స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి.. సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. కొందరు భక్తులు కొండ దిగువన మట్టికుండలో పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా తయారుచేసి స్వామికి సమర్పించారు. మరికొందరు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కొండపైన అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామి, ఉద్దాలను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో రద్దీగా కనిపించింది. జాతర మైదానంలో ఏర్పాటుచేసిన దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా మారాయి.



దర్శనానికి క్యూ..

- కురుమూర్తిస్వామిని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి.. స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే తన సొంత ఖర్చుతో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు బాదం వెంకటేశ్వర్లు, భారతమ్మ, నాగరాజు, భాస్కరాచారి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తుల జేబుకు చిల్లు..

కురుమూర్తిస్వామి ఆలయం వద్ద భక్తులకు భద్రత కరువైంది. వేలాదిగా తరలివచ్చిన భక్తుల సౌకర్యార్థంగా ప్రత్యేకంగా ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో తోపులాడుకుంటూ దర్శనానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే అదునుగా కొందరు భక్తుల జేబుకు చిల్లు పెట్టారు. ముగ్గురు భక్తుల నుంచి దాదాపుగా రూ. 40వేలు చోరీ చేశారు. ఆత్మకూర్ మండలం బాలకిష్టాపురం గ్రామానికి చెందిన నాగరాజు నుంచి రూ. 18వేలు, కొత్తకోట మండలం కనిమెట్టకు చెందిన హనుమంతు రూ. 3వేలు, హైదరాబాద్‌కు చెందిన కేశవరెడ్డి నుంచి రూ. 17వేలు చోరీ చేశారు. బాధితులు దేవస్థానం కార్యాలయంలో ఫిర్యాదు చేసి.. సీసీ పుటేజీలో పరిశీలించినా ఫలితం లేకపోయింది.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

అలంపూర్: శ్రావణమాసం అమావాస్యను పురస్కరించుకొని శనివారం జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి క్షేత్రంలో చండీహోమం నిర్వహించారు. అమ్మవారి ఆలయ హోమ మండపంలో వేదమంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించిన చండీహోమంలో 210 మంది భక్తులు పాల్గొన్నట్లు ఆలయ ఈఓ దీప్తి తెలిపారు. కాగా, శ్రావణమాసం చివరి రోజు సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

జూరాలకు వరద జోరు



జూరాల నుంచి దిగువకు విడుదలవుతున్న వరద

ప్రాజెక్టు 44 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

ధరూరు: ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు రోజురోజుకు వరద పెరుగుతోందని పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం 3.55 లక్షల క్యూసెక్కులు ఉండగా.. శనివారం రాత్రి 8.30 ప్రాంతంలో మరింత పెరిగి 4.08 లక్షలకు చేరిందని వివరించారు. ఈ సీజన్‌లో ఇంత పెద్దమొత్తంలో వరద రావడం ఇదే మొదటిసారి అన్నారు. దీంతో ప్రాజెక్టు 44 క్రస్ట్‌గేట్లు పైకెత్తి 4,16,629 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని చెప్పారు. ఆవిరి రూపంలో 40 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 820, కుడి కాల్వకు 470 క్యూసెక్కులు వదిలినట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 6.622 టీఎంసీలు ఉందన్నారు.

నిలిచిన విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టుకు ఎగువ కర్ణాటక నుంచి వరద భారీగా చేరుతుండటంతో దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో శనివారం ఉత్పత్తి నిలిచిపోయినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు.

ఆల్మట్టి, నారాయణపూర్‌కు మళ్లీ పెరిగిన ఇన్‌ఫ్లో..

కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో శనివారం మరింత పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆల్మట్టి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 98.876 టీఎంసీలు ఉందన్నారు. ప్రాజెక్టుకు 2,65,944 క్యూసెక్కుల వరద వస్తుండగా.. దిగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు 2 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 25.315 టీఎంసీలు ఉందని వివరించారు. ప్రాజెక్టుకు 2.10 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 30 గేట్లు ఎత్తి దిగువన ఉన్న జూరాల ప్రాజెక్టుకు 2,10,108 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు వివరించారు.

ఇద్దరు దొంగల అరెస్టు

4 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో రికవరీ



నిందితుల నుంచి రికవరీ చేసిన ద్విచక్ర వాహనాలతో సీఐ అశోక్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ క్రైం: జల్సాలకు అలవాటుపడి ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు బైక్‌లు, ఒక ఆటోను రికవరీ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం నాగర్‌కర్నూల్ సర్కిల్ పోలీసు కార్యాలయంలో సీఐ అశోక్‌రెడ్డి వెల్లడించారు. ఆయన వివరాల మేరకు.. పెద్దకొత్తపల్లి మండలం వావిళ్లబావికి చెందిన శాగాది యుగంధర్, జిల్లా కేంద్రంలోని వినోబానగర్ కాలనీకి చెందిన వేపూరి నీలాంబర్ స్నేహితులు. ఇరువురు జల్సాలకు అలవాటుపడి హైదరాబాద్, నాగర్‌కర్నూల్ తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. గత నెల 29న జిల్లా కేంద్రంలోని ఓ ఇంటి ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనాన్ని చోరీ చేయడంతో.. బాధితుడు ఈ నెల 1న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. శనివారం జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో అనుమానాస్పదంగా తిరుగుతున్న శాగాది యుగందర్, వేపూరి నీలాంబర్‌లను అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో వారిని విచారించడంతో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్నట్లు నేరం అంగీకరించారు. నిందితుల నుంచి రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్, వనస్థలీపురం, మేడిపల్లి పోలిస్టేషన్‌తో పాటు నాగర్‌కర్నూల్, కల్వకుర్తి పోలిస్‌స్టేషన్ పరిధిలో చోరీకి గురైన నాలుగు ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను రికవరీ చేశారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ గోవర్ధన్, పట్టణ రెండో ఎస్‌ఐ వినోద్, ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు వెంకటేశ్, రమేశ్, భీముడు ఉన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

కేటీదొడ్డి : ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మల్లాపురం గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు కంబయ్య శనివారం ఉదయం పొలంవద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో తన పొలం వద్ద ఉన్న బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి మృతుడు మౌలాలి (30)గా గుర్తించారు. దివ్యాంగుడైన మౌలాలి బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

కారులో మంటలు.. తప్పిన ప్రమాదం



కొట్రగేట్ వద్ద మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వెల్దండ: మండలంలోని కొట్రగేట్ వద్ద హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై శనివారం ఉదయం కారులో ఒక్కసారిగా మంటల రావడంతో కారు దగ్ధమైంది. వివరాలిలా.. వెల్దండలో నివాసముంటున్న మేస్త్రీ పీట్ల సుధాకర్ కారులో కల్వకుర్తి బయలుదేరాడు. కొట్రవద్దకు రాగానే కారు అకస్మాత్తుగా ఆగిపోయింది. వెంటనే ఆయన కారు ఆన్‌చేసినా ముందుకు వెళ్లడంలేదు. అకస్మాత్తుగా కారులోని ముందుభాగంలో మంటలు వచ్చాయి. సుధాకర్ కారులో కిందకు దిగడానికి ప్రయత్నం చేసిన కారు డోర్లు తెరుచుకోవడం లేదు. గమనించిన తండావాసులు కారు అద్దాలను ధ్వంసం చేసి సుధాకర్‌ను బయటకు తీశారు. స్థానికు నీళ్లు చల్లిన మంటలు ఆగిపోలేదు. కల్వకుర్తి ఫైర్‌స్టేషన్, వెల్దండ పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకోని మంటలు అదుపుచేశారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెంచు యువకుడిపై దాడి: కేసు నమోదు

మన్ననూర్: స్థానిక లింగమయ్య కాలనీకి చెందిన దాసరి మురళీధర్‌పై పలువురు దాడి చేసిన ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అమ్రాబాద్ ఎస్‌ఐ గిరి మనోహర్‌రెడ్డి తెలిపారు. పదర మండలంలోని పెట్రాల్‌చేన్, అమ్రాబాద్ మండలం సార్లపల్లికి చెందిన కొందరు చెంచులు కొంతకాలంగా అన్య మతాన్ని అభిమానించడమే కాకుండా పూర్తిగా ఆ మతంలోనే ఉంటున్నారు. ఈ క్రమంలో ఆ మతంలో ఉండటం సరైంది కాదని బాధితుడు మురళీధర్‌తో పాటు మరికొందరు చెంచులు విమర్శలు చేశారని తెలిసింది. దీంతో అవమానంగా భావించిన వారు కోపోద్రిక్తులై మన్ననూర్‌లోని లింగమయ్య కాలనీలో ఉన్న మురళీధర్‌పై దాడి చేశారు.

భార్యాభర్తలను విడదీశాడన్న అనుమానంతో హత్య

- వృద్ధుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడి అరెస్టు



హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు

వనపర్తి రూరల్: పాన్‌గల్ మండల కేంద్రానికి చెందిన ఎనుముల కిష్టయ్య (65) హత్య కేసును పోలీసులు ఛేదించారు. అదే గ్రామానికి చెందిన వసంతపురం రాములు తన భార్య తనను విడిచివెళ్లడానికి కిష్టయ్య కారణమనే అనుమానంతో హతమార్చినట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం వనపర్తి సీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ వెల్లడించారు. పాన్‌గల్‌కు చెందిన ఎనుముల కిష్టయ్య గొర్రెల వ్యాపారం చేసుకొని జీవించే వాడు. అయితే అదే గ్రామానికి చెందిన వసంతపురం రాములు, తన భార్య మధ్య కిష్టయ్య గొడవపెట్టడంతోనే తనను విడిచిపెట్టి వెళ్లిందనే అనుమానంతో పాటు ఎలాగైనా బైక్ కొనాలనే ఉద్దేశంతో పథకం ప్రకారం ఈ నెల 20న రాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న కిష్టయ్యపై పప్పుగుత్తితో దాడిచేసి హతమార్చాడు. అనంతరం కిష్టయ్య జేబులో ఉన్న రూ. 40వే నగదు దోచుకొని.. పప్పుగుత్తిని ఎవరు గుర్తించకుండా మురుగు కాల్వలో పడేశాడు. మృతుడి కుమారుడు ఎనుముల శివయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. శనివారం పాన్‌గల్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వసంతపురం రాములును అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించడంతో చేసిన నేరం అంగీకరించి.. హత్యకు వినియోగించిన పప్పుగుత్తి కాడ, రక్తపు మరకలు ఉన్న బట్టలను చూయించాడు. నిందితుడిని అరెస్టు చేసి రూ. 34వేలు రికవరీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన వనపర్తి సీఐ కృష్ణయ్య, పాన్‌గల్ ఎస్‌ఐ శ్రీనివాసులు, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.